ప్రజాశక్తి

మంగళవారం 8 జులై 2025 5

శ్రీ సత్యసాయి

చెరువు భూమి సాగుకు తీర్మానం..!



గ్రామ సభలో తీర్మానం చేసిన ధ్రువీకరణ పత్రం

◆ కార్యదర్శి నిర్ణయంపై విస్మయం
◆ ఇప్పటికే ఆ ప్రదేశంలో ప్రభుత్వ పాఠశాల
◆ పాఠశాలకు ఎసరు పెట్టేలా తీర్మానాలు
◆ ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

10 ఏళ్ల పోరాట ఫలితంగా వెంకటాపురంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సాధించారు. అనుమతులు కూడా వచ్చాయి. గత ఐదేళ్లలో దాతల సహకారంతో వీరాపురం సర్వే నెంబర్ 10 లో తాత్కాలికంగా భవనం నిర్మించారు. ఆ గదులలో తరగతులు నిర్వహిస్తున్నారు. గత రెండేళ్లలో మారుమూల పల్లె ప్రాంతాలలో ఉన్న విద్యార్థులతో పాఠశాలలో అడ్మిషన్ల సంఖ్య పెరిగింది. అక్కడి ఉపాధ్యాయుల పోరాటంతో ప్రభుత్వం సైతం భవనాన్ని మంజూరు చేసింది. నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి.

పాఠశాలకు ఎసరు తెచ్చేలా తీర్మానం

అంతా బాగుంది పోరాటంతో పది వరకు తరగతులు పెంచుకున్నామని అక్కడి విద్యార్థుల తల్లి దండ్రులు, ఉపాధ్యాయులు ఆనందపడుతున్న సమయంలో పిడుగు లాంటి వార్త వారిని కలచి వేసింది. ఈ భూమిపై హై కోర్టులో రిట్ వేశారంట అని తహశీల్దార్ కార్యాలయం నుండి కాల్ రావడంతో కంగుతిన్నారు. ఏం జరిగిందని ఆరా తీస్తే ముగ్గురు వ్యక్తులు తాము సాగులో ఉన్నట్లు పిటీషన్ వేశారని తేలింది. వీరికి ఎలా హక్కులు వచ్చాయని ఆరా తీస్తే వారు సాగులో ఉన్నట్లు గ్రామ సభ తీర్మానాన్ని కార్యదర్శి ధ్రువీకరించి ఇచ్చిన పత్రం చూపారు. ఐదేళ్లుగా అక్కడ పాఠశాల ఉంది ఇప్పుడు కొత్తగా వచ్చిన కార్యదర్శి వారు సాగు చేస్తున్నారని ఎలా తీర్మానం ఇచ్చారన్నది ప్రశ్నార్థకంగా మారింది. అధికారికంగా సాగులో ఉన్నారా లేదా అని నివేదిక ఇవ్వాల్సింది వీఆర్వో ,రెవెన్యూ అధికారులు. మరి కార్యదర్శి తీర్మానం చేయల్సిన అవసరం ఏముందన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఫీల్డ్‌లో ప్రభుత్వ పాఠశాల ఉన్నా, ఆస్థలంలో నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నా కార్యదర్శిని కనిపించలేదా అని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

కార్యదర్శి తీర్మానం చెల్లుతుందా..?

గ్రామ సభ తీర్మాణాలలో గ్రామ పంచాయతీకి సంబందించిన భూములపై తీర్మానాలు ఇవ్వడానికి అవకాశం ఉంటుంది. అయితే ప్రభుత్వ పాఠశాల నిర్మించిన స్థలంలో వేరొకరు సాగుచేస్తున్నారని వారే వారసులుగా పరగనిస్తూ గ్రామ సభ తీర్మానం ఇవ్వవల్సిన ఆవస్యకత ఎందుకు ఏర్పడిందన్నది పెద్ద ప్రశ్నగా మిగిలింది. ఏది ఏమైన కార్యదర్శి చేపట్టిన ఈ చర్య సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. సాగులో ఉన్నారా లేదా అన్నది రెవెన్యూ అధికారులు నివేదిక ఇవ్వాలి . కాని కార్యదర్శి ఇవ్వడం దానికి రిట్ పిటీషన్‌కు అటాచ్ చేయడం సాపోర్ట్ డాక్యుమెంట్‌గా మారడానికి కారణం అయిందని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కార్యదర్శి తీరుపై విచారణ చేయాలి...

ఓ ప్రభుత్వ పాఠశాల విషయంలో ఆ స్థలాన్ని వేరొకరు సాగుచేస్తున్నారని కార్యదర్శి గ్రామసభలో తీర్మానం చేయడం దానిపై సర్పంచి సంతకం ఉండటం పలు అనుమానాలకు తావిస్తోంది. దీనిపై సమగ్ర విచారణ చేసి ప్రభుత్వ పాఠశాలను పరిరక్షించాలని అలాగే అందుకు కారుకులైన వారిపై చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

భూ నిర్వాసితుల నిరీక్షణ..!

◆ ఏళ్లు గడుస్తున్నా అందని పరిహారం
◆ హంద్రీనీవా నిర్వాసితుల ఎదురుచూపు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

హంద్రీనీవా భూ నిర్వాసితులకు ఏళ్లుగా నిరీక్షణ తప్పడం లేదు. సంవత్సరాల తరబడి పరిహారం కోసం రైతులకు ఎదురు చూపులే మిగులుతున్నాయి. ఎప్పటికి భూ పరిహారం లభిస్తుందో తెలియలేదు. ప్రభుత్వాలు మారినప్పుడల్లా హంద్రీనీవాను పూర్తి చేస్తామన్న ప్రకటనలు వెలువడుతూనే ఉన్నాయి. కొంతమేరకు పనులు చేయడం ఆ తరువాత నిలుపదల చేయడం జరుగుతూనే వస్తోంది. ఈ ప్రాజెక్టు కోసం తీసుకున్న భూమికి మాత్రం రైతులకు పరిహారం అందటం లేదు.

3527 ఎకరాలకు అందని పరిహారం

హంద్రీనీవా మొదటి దశ కింద భైరవానితిప్ప, అప్పర్ పెన్నార్ ఎత్తిపోతల పథకంతోపాటు, అమిద్యాల బ్రాంచ్‌కెనాల్, 33, 34, 36 ప్యాకేజీలున్నాయి. వీటన్నింటి పరిధిలోనూ భూసేకరణలు పెండింగ్‌లో ఉన్నాయి. భైరవానితిప్ప, పెన్నార్ ఎత్తిపోతల ప్రాజెక్టుకు 2018లో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు శంకుస్థాపన చేశారు. ఆ తరువాత 2019లో వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. భూసేకరణ చేసి పనులు ప్రారంభిస్తామని ప్రకటించింది. భూసేకరణ మాత్రం చేయలేదు. 2023లో భూసేకరణకు నిధులు మంజూరు చేస్తున్నట్టు కళ్యాణదుర్గం నియోజకవర్గంలో అప్పటి ముఖ్యమంత్రిగా ఉన్న వైఎస్.జగన్మోహన్‌రెడ్డి బటన్ నొక్కారు. ఆ డబ్బులు కూడా పూర్తి స్థాయిలో పడలేదు. కొంత భూసేకరణ ఆగింది. ఇప్పుడు కూడా ఇంకా భూసేకరణకు నిధులు

ప్రాజెక్టు పేరు	భూసేకరణ అవసరం	సేకరించినది	ఇంకా సేకరించాల్సినది
అప్పర్ పెన్నార్ ప్రాజెక్టు	2729	988	1508
భైరవానితిప్ప ప్రాజెక్టు	1406	789	617
పంప్‌హౌస్‌కు	120	00	120
ఆమిద్యాల బ్రాంచ్ కెనాల్	80	69	09
గుంతకల్లు చెరువులకు	230	00	230
ప్యాకేజీ33	1224	1203	49
ప్యాకేజీ 34	1267	1009	157
ప్యాకేజీ 35ఎ	1175	00	1175
ప్యాకేజీ 36 బి	460	00	460
మొత్తం	**9500**	**4808**	**3524**

మంజూరవలేదు. దీంతో ప్రాజెక్టు ముందుకు పోవడం ఆగమ్యగోచరంగానే ఉంది. ఈ పనులన్నింటికీ కలిపి 9500 ఎకరాలు భూసేకరణ అవసరమవుతుంది. ఇప్పటి వరకు 4808 ఎకరాలు సేకరించారు. ఇంకా 3524 ఎకారల భూసేకరణపై ప్రాజెక్టుల పరిధిలో చేపట్టాల్సి ఉంది.

ఈ ప్రభుత్వంలోనైనా పరిహారం అందేనా.?

కూటమి ప్రభుత్వం హంద్రీనీవా పనులను తమ కాలంలో పూర్తి చేస్తామని ప్రకటించింది. ఈ కాలంలోనైనా భూములు కోల్పోయిన రైతులకు పరిహారం అందిస్తారన్న ఆశతో రైతులు ఎదురు చూస్తున్నారు. ఈ మేరకు కూటమి నేతలు కూడా తాము ప్రాజెక్టులను పూర్తి చేస్తామని ప్రకటనలు చేస్తున్నారు. కొంతవరకు పనులు కూడా మొదటి, రెండో దశలోనూ నడుస్తున్నాయి. అప్పర్ పెన్నార్ ఎత్తిపోతలు, బిటిపి ఎత్తిపోతల పనులు ప్రారంభించనున్నట్టు కూడా నేతలు చెబుతున్నారు. దీంతో రైతులు తమ నిరీక్షణ ఫలిస్తుందని ఆశగా ఎదురు చూస్తున్నారు.

అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-అగళి

రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమమే కూటమి ప్రభుత లక్ష్యమని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొ న్నారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం ఎమ్మెల్యే రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్‌మూర్తి మండలంలోని పి.బ్యాడిగెర, హెచ్‌డి.హళ్లి పంచాయతీల్లో పర్యటించారు. వారు ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. చంద్రబాబు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్ర మాల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే ప్రజలను అడిగి సమస్యలు తెలుసుకున్నారు. వీలైన వాటిని అక్కడికక్కడే పరిష్కరించడంతో పాటు మిగిలిన వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. వారి వెంట జడ్పిటిసి ఉమేష్, టిడిపి మండల కన్వీనర్ తిప్పేస్వామి, నాయకులు కుమార్‌స్వామి, స్థానిక ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ఎస్‌టియు జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్ర వ్యాప్తంగా ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని ఎస్‌టియు నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలో సోమవారం ఎస్‌టియు ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా ప్రధాన కార్యదర్శి కోనంకి చంద్రశేఖర్ మాట్లాడుతూ బదిలీ, ఉద్యోగోన్నతి పొందిన ఉపాధ్యాయులకు పొజిషన్ ఐడిలు కేటాయించి జీతాలు పొందేలా, ఇదే నెలలో జీతాల బిల్లులు ఆమోదం తెలిపేలా చూడాలని కోరారు. అలాగే 12వ పిఆర్‌సి అమలుతో పాటు 30 శాతం మధ్యంతర భృతి, బకాయి డిఎలు చెల్లించాలని కోరారు. అలాగే ఉపాధ్యాయులకు బోధనేతర పనులు తగ్గించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు ఆదినారాయణ, డిఆర్.తిప్పేస్వామి, నవీన్, సత్యనారాయణరెడ్డి, మాలతి పాల్గొన్నారు.

కెజిబివిలో వంట గదిని పరిశీలిస్తున్న ఎంపిడిఒ వెంకటలక్ష్మి

కెజిబివి తనిఖీ

సోమందేపల్లి : మండలంలోని పాపిరెడ్డిపల్లి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయ(కెజిబివి)ను సోమవారం ఎంపిడిఒ వెంకటలక్ష్మి తనిఖీ చేశారు. ఈ పాఠశాలలో ఇటీవల విద్యార్థినులు అస్వస్థతకు గురైన నేపథ్యంలో ఉన్నతాధికారులు వరుస తనిఖీలు నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా ఎంపిడిఒ పాఠశాలకు వెళ్లి నీటి ట్యాంకు, వంటగదిని తనిఖీ చేశారు. వంట పాత్రలు, ఆహార పదార్థాలను పరిశీలించారు. విద్యార్థినులకు ఎట్టి పరిస్థితుల్లో నాణ్యమైన ఆహారం అందించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. అలాగే ఫుడ్ పాయిజన్ బారిన పడిన విద్యార్థినుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు.

'స్మృతివనం' ప్రయివేటీకరణ నిర్ణయాన్ని విరమించుకోవాలి

మడకశిర : విజయవాడలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ స్మృతివనంపై ప్రయివేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సోమవారం పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్‌లో వైసిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి ఆధ్వర్యంలో డిహెచ్‌పిఎస్, దళిత సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఆ జీవో ప్రతులను చించి దహనం చేశారు. నరసింహమూర్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అంబేద్కర్ స్మృతివనాన్ని ప్రయివేటుపరం చేస్తూ వ్యాపార కేంద్రంగా మారుస్తున్నారని ఆరోపించారు. స్మృతి వనంగానే కొనసాగించాలని, లేనిచో పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సత్యనారాయణ, గోపి, హనుమంతు పాల్గొన్నారు.

టిడిపి కార్యకర్త మృతికి నివాళి

గుడిబండ : మండలంలోని బూదిపల్లి గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు జయరామప్ప పెద్దనాన్న తిమ్మప్ప సోమవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న జమ్మలబండ పంచాయతీ మాజీ సర్పంచి, ప్రస్తుత టిడిపి మండల ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్ ఆ గ్రామం వెళ్లి తిమ్మప్ప మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తిమ్మప్ప కుటుంబ సభ్యులను పరామర్శించి టిడిపి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. శ్రీనాథ్ మాట్లాడుతూ తిమ్మప్ప మృతి టిడిపికి తీరని లోటు అన్నారు. ఆయన పార్టీ కోసం ఎంతో కృషి చేశారని, అలాంటి వ్యక్తి మన నుంచి దూరం కావడం బాధాకరమని తెలిపారు. ఆయన వెంట పార్టీ సీనియర్ నాయకులు బూదిపల్లి జయరామ్, భీమేష్, కార్యకర్తలు పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి ఎంపీ పరామర్శ

రొద్దం : రొద్దం పంచాయతీ మాజీ టౌన్ కన్వీనర్ చంద్రశేఖర్ నాయుడు అనారోగ్యంతో సోమవారం మృతిచెందాడు. విషయం తెలుసుకొన్న ఎంపీ బికె.పార్థసారథి ఆ గ్రామం వెళ్లి చంద్రశేఖర్‌నాయుడు మృతదేహానికి పూలమాల వేసి, టిడిపి జెండా కప్పి నివాళులర్పించారు. అలాగే కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి మహిళా జిల్లా అధ్యక్షురాలు సుబ్బ రత్నమ్మ, జిల్లా అధికార ప్రతినిధి నరసింహులు, చిన్నప్పయ్య, మురళి, సత్యశేఖర్, ఎం.కొత్తపల్లి సర్పంచి నాగరాజు, క్రిష్టప్ప, రాజప్ప, కోళ్ల శ్రీనివాసులు, లాయర్ అశ్వార్థ నారాయణ పాల్గొన్నారు.

చంద్రశేఖర్‌నాయుడు మృతదేహానికి పూలమాల వేస్తున్న ఎంపీ బికె.పార్థసారథి

గోడ పత్రికలను విడుదల చేస్తున్న కలెక్టర్, పాటు వ్యవసాయ శాఖ అధికారులు

పిఎం ఫసల్ బీమాతో రైతులకు లబ్ధి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

2025 ఖరీఫ్ సీజన్‌లో పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో రైతులు బీమా చేయించుకుని దాని ద్వారా లబ్ధి పొందాలని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్లో పిఎం ఫసల్ బీమా యోజనకు సంబంధించి గోడ పత్రికలను విడుదల చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దిగుబడుల ఆధారంగా పంటల బీమా కోసం కంది, వరి, మొక్కజొన్న, ఆముదం, రాగి పంటలు కోసం బీమా చేయించుకోవచ్చన్నారు. నూతన వాతావరణ ఆధారిత బీమా పంటల పథకంలో జిల్లాలో పత్తి, వేరుశనగ, దానిమ్మ, బత్తాయి, టమోటా పంటలు ఉన్నాయని, ఈ పథకం అమలకు గాను ఇఫ్కో టోకియో కంపెనీ అమలు చేస్తోందన్నారు. వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వైవి.సుబ్బారావు మాట్లాడుతూ పంటల బీమా పథకంలో రైతులు సొంతంగా ప్రీమియం చెల్లించి నమోదు చేసుకోవాలన్నారు. బ్యాంకుల్లో పంటల రుణాలు తీసుకునేప్పుడు రైతులు బీమా నమోదు చేయించుకోవచ్చు అన్నారు. ఒకవేళ రైతుకు ఇష్టం లేకపోతే బీమా మినహాయింపు కోరవచ్చన్నారు. రైతు ప్రీమియంను జాతీయ పంటల బీమా పోర్టల్, మీ సేవ కేంద్రంలో నమోదు చేయించుకోవచ్చు అన్నారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

ప్రజాశక్తి-రొద్దం

విద్యార్థిని మానసకు ల్యాప్‌టాప్ అందిస్తున్న చిన్నప్పయ్య

మండలంలోని పెద్దగువ్వలపల్లి కొట్టాల గ్రామానికి చెందిన రైతు సూరి కుమార్తె మానసకు సోమవారం టిడిపి మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య ల్యాప్‌టాప్ అందజేశారు. మానస బి.టెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. ఆమె అనంతపురంలోని ఎస్‌కె యూనివర్సిటీలో చదువుతూ ప్రథమ సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించింది. ఆమె ఉన్నత చదువులకు ల్యాప్‌టాప్ అవసరం అని తెలుసుకున్న చిన్నప్పయ్య పెద్దగువ్వలపల్లి గ్రామంలోని తన ఇంట్లో మానసకు ల్యాప్‌టాప్ అందజేశారు. విద్యార్థిని మానస మాట్లాడుతూ ఉన్నత చదువులకు అవసరమైన ల్యాప్ టాప్ అందించిన చిన్నప్పయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఎల్.వెంకటరాముడు, అల్లు ఆంజనేయులు, సంజయ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రాధాన్యతాక్రమంలో ఎన్నికల హామీల అమలు

ప్రజాశక్తి-రొద్దం

రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులున్నా కూటమి ప్రభుత్వం ప్రాధాన్యతాక్రమంలో ఎన్నికల హామీలను అమలు చేస్తుందని టిడిపి నాయకులు పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రి సవిత ఆదేశాల మేరకు సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం టిడిపి ఆధ్వర్యంలో మండలంలోని భూచెర్ల గ్రామంలో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి సుపరిపాలనకు సంబంధించిన కరపత్రాలు పంపిణీ చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. మండల నాయకులు మాట్లాడుతూ చంద్ర బాబు ప్రభుత్వం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము రూ. 4వేలకు పెంచడంతోపాటు కుటుంబంలో ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం అమలుచేసిందన్నారు. ఉద్యోగులకు ప్రతి నెలా 1వ తేదీనే వేతనాలు ఇస్తుందన్నారు. అన్న క్యాంటీన్లు ప్రారంభించిందన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయ కులు మాధవనాయుడు, టైలర్ ఆంజనేయులు, నరసింహులు, పుల్లప్పచౌదరి, రెడ్డివారి మంజునాథ్, చంద్రమౌళి, ముత్యాలు, నరసింహులు, కదిరన్న, కార్యకర్తలు, పాల్గొన్నారు.

సుపరిపాలన కరపత్రాలు పంపిణీ చేస్తున్న టిడిపి నాయకులు

శిథిలావస్థలో పంచాయతీరాజ్ అతిథి గృహం..!

◆ మంత్రులు, ఉన్నతాధికారులు వస్తే విడిదికి ఇబ్బందులు
◆ మందుబాబులకు అడ్డాగా మారిన వైనం

నిరపయోగంగా ఉన్న పంచాయతీరాజ్ అతిథి గృహం

ప్రజాశక్తి-పెనుకొండ

చారిత్రక ప్రాధాన్యం ఉన్న పెనుకొండలో ప్రభుత్వ అతిథి గృహాలు లేవు. దీంతో ఇక్కడికి పర్యటనల నిమిత్తం వచ్చే మంత్రులు, ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. ఆర్అండ్‌బి అతిథి గృహం ఒకటే ఉండడంతో అధికారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రముఖ కార్ల పరిశ్రమ కియా, నాసన్, రాచరిక పట్టణం పెనుకొండను సందర్శించడానికి తరచూ కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఉన్నతాధికారులు వస్తుంటారు. వీరికి ఆతిథ్యమివ్వలేక అధికారులు నానా తంటాలు పడుతున్నారు. ఒక ఆర్ అండ్ బి అతిథి గృహం తప్ప మరే ఇతర ప్రభుత్వ గెస్ట్ హౌస్‌లు లేవు. పంచాయతీరాజ్ అతిథి గృహం దాదాపు 8 ఏళ్లుగా మూతబడి శిథిలావస్థకు చేరుకుంది. పాలకులు ఎందరు మారినా అతిథి గృహం రూపురేఖలు మారలేక కళావిహీనంగా తయారై బూతు బంగ్లాను తలపిస్తోంది.

శిథిలావస్థలో పంచాయతీ రాజ్ అతిథి గృహం

పట్టణంలో ఉన్న పిఆర్ అతిథి గృహం మరమ్మతులకు నోచుకోక శిథిలావస్థకు చేరింది. గతంలో ఈ అతిథి గృహాన్ని ప్రజాప్రతినిధులు, అధికారులు, మంత్రులు విరివిగా ఉపయోగించుకున్నారు. 8 ఏళ్ల క్రితం వరకూ ఈ గెస్ట్ హౌస్‌లో ఇటు ప్రజాప్రతినిధులు, అటు అధికారులు ఇష్టారాజ్యంగా వినియోగించుకున్నారు. చిన్న చిన్న మరమ్మతులు ఉండడంతో ఈ అతిథి గృహాన్ని బూతు బంగ్లాగా మార్చే శారు. పంచాయతీరాజ్ శాఖ అధికారులు మరమ్మతులు చేయించేందుకు ముందుకు రాకపోవడంతో ప్రస్తుతం ఈ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరుకుంది. గెస్ట్ హౌస్‌లో ఉన్న విలువైన ఫర్నిచర్, మంచా లు, ఏసీలు పూర్తిగా శిథిలమైపోయాయి. మరుగుదొడ్లకు ఉపయోగించే నీటి పైపులు ధ్వంసమ య్యాయి. విద్యుత్ పరికరాలు పూర్తిగా పాడై రాత్రి వేళ అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది.

దెబ్బతిన్న తాగునీటి పైపులైన్

మరమ్మతులకు అతిథి గృహం

వైసిపి అధికారంలో ఉన్న సమయంలో పంచాయతీరాజ్ గెస్ట్ హౌస్ నిర్వహణ పూర్తిగా గాలికి వదిలేసింది. పంచాయతీరాజ్ అధికారులు అతిథి గృహం మరమ్మతులకు నిధుల మంజూరు కోసం పలుమార్లు ప్రభుత్వానికి నివేదికలు పంపినా ఫలితం లేకపోయింది. వైసిపి హయాంలో అప్పటి ఎమ్మెల్యే శంకర్ నారాయణ మంత్రిగా పనిచేసినా అతిథి గృహం మరమ్మతులకు నిధులు మంజూరు చేయించలేకపోయారు. ప్రస్తుత ఎమ్మెల్యే, మంత్రి సవిత చొరవ చూపి బూతు బంగ్లాగా మారిన పంచాయతీరాజ్ అతిథి గృహానికి నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేసి పూర్వ వైభవం తీసుకు వస్తారని అధికారులు, ప్రజాప్రతినిధులు ఆశిస్తున్నారు.

మంత్రులు, ఉన్నతాధికారులు వస్తే విడిదికి ఇబ్బందులు

అతిథి గృహాలు లేక ఇక్కడికి పర్యటనల నిమిత్తం వచ్చే ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఆతిథ్యం ఇవ్వలేని పరిస్థితి నెలకొంది. తరచూ కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు ఇక్కడికి పర్యటనల నిమిత్తం వస్తారు. ఒక్కసారిగా ముగ్గురు, నలుగురు వివిఐపిలు, విఐపిలు వస్తే అతిథులకు ఎక్కడ ఆతిథ్యం ఇవ్వాలో తెలియక సతమతమవుతున్నారు. కొందరు ప్రయివేటు రిసార్టు సమీపంలో ఉన్న బెంగళూరు, అనంతపురం, తదితర ప్రాంతాల్లో వసతులు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ అతిథి గృహాలు లేకపోవడంతో ప్రభుత్వ శాఖల పనితీరు, పథకాల అమలు తీరుపై రివ్యూలు జరిపేందుకు వచ్చే ఉన్నతస్థాయి అధికారులకు ఆర్అండ్‌బి అతిథి గృహమే ఆశ్రయం ఇస్తుంది. ఇక్కడ ఉన్న రెండు గదుల్లో సమావేశాలు నిర్వహించడం ఇబ్బందిగా మారింది.

మందుబాబులకు అడ్డాగా..

శిథిలావస్థలో ఉన్న పిఆర్ అతిథి గృహం మందుబాబులకు అడ్డాగా మారింది. పెనుకొండ– అనంతపురం ప్రధాన రహదారి పక్కనే ఉండడంతో రాత్రి అయితే మందుబాబులు మందు మద్యం తాగుతూ నానా హంగామా చేస్తున్నారు. పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కార్యాలయం పక్కనే ఉన్న ఈ అతిథి గృహాన్ని పర్యవేక్షించకపోవడంతో అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారింది. కార్యాలయాల వాచ్‌మెన్లు సైతం అతిథి గృహం వైపు కన్నెత్తి చూడడం లేదనే ఆరోపణలు ఉన్నాయి.

డిడిఒ కార్యాలయంగా మార్పు : ఎంపిడిఒ

ప్రస్తుతం శిథిలావస్థలో ఉన్న పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని మరమ్మతులు చేసి తాత్కాలిక డిడిఒ కార్యాలయంగా మార్పు చేస్తున్నట్లు ఎంపిడిఒ నరేష్‌కృష్ణ తెలిపారు. మంత్రి సవిత చొరవ తీసుకొని జడ్‌పి నిధుల కింద రూ. 19 లక్షలు మంజూరు చేయించారని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని ఎంపిడిఒ తెలిపారు.

పంచాయతీరాజ్ అతిథి గృహంలో పాడైన మంచం, కుర్చీలు

రైతులకు కందులు పంపిణీ

ప్రజాశక్తి - కొత్తచెరువు

ఖరీఫ్‌లో కందిపంట సాగు చేసే రైతులకు ప్రభుత్వం నుండి జాతీయ ఆహార మిషన్ పథకం కింద సబ్సిడీపై కందులను పంపిణీ చేస్తున్నట్లు ఎఒ సతీఫ్‌బాబు తెలిపారు. మండలానికి ఎల్ ఆర్ జి 52 రకం 14 కింటాళ్లు, ఎల్‌ఆర్‌జి 105 రకం 13 కింటాళ్లు మొత్తం 27 క్వింటాళ్ల కందులను మండలానికి చేరినట్లు చెప్పారు. వీటిని రైతు సేవా కేంద్రం నుండి రైతులను పంపిణీ చేస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఎస్ శ్రీనివాసులు, టౌన్ కన్వీనర్ వలిపి శ్రీనివాసులు, టిడిపి నాయకులు వంశీ కిషోర్, ఏఈవో సునీత, రెడ్డప్ప చౌదరి, చందన, గాయత్రి, జనసేన కన్వీనర్ శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అలరించిన గిరిజన నృత్యప్రదర్శన

ప్రజాశక్తి - తనకల్లు

మండల కేంద్రంలోని ఎస్ జి ఎన్ ఆర్ ప్రభుత్వ కళాశాలలో అనంత అటవీ, గ్రామీణ అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో లంబాడి నృత్య ప్రదర్శన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షులు తోట నరసింహులు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ సంస్కృతి శాఖ వారి సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. తోలుబొమ్మలాటలు లంబాడి నృత్యాలు, జానపద గేయాలు, కళాకారులు మరుగున పడకుండా ప్రభుత్వం వారి పట్ల చొరవ చూపి ప్రోత్సహిస్తోందన్నారు. అదేవిధంగా ఇటీవల జరిగిన ఆపరేషన్ సింధూర్‌లో మృతిచెందిన జవాన్ మురళి నాయక్ చిత్రపటానికి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కోఆర్డినేటర్ శివశంకర్ రావు, కళాశాల ప్రిన్సిపల్ చెన్నకేశవ ప్రసాద్, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్య సహాయకులతో సమీక్ష

ప్రజాశక్తి - కదిరి అర్బన్

పి హెచ్ సి పరిధిలోని మూర్తిపల్లి సబ్ యూనిట్ పడమర అధికారి దేవల నాయక్ ఆధ్వర్యంలో ఎం పి హెచ్ ఎ సిబ్బంది సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఆరోగ్య సిబ్బందికి కేటాయించిన గ్రామాలలో హాజరై వ్యాధుల ప్రబలకుండా నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులు సూచించారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే తప్పక పాటించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత ప్రాముఖ్యతను తెలియజేయాలని సూచించారు ఈసందర్భంగా ఆరోగ్య సహాయకుల రికార్డులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ సూపర్వైజర్ శశిధర్, ఆరోగ్య సహాయకులు పాల్గొన్నారు.

నల్లచెరువు తహశీల్దార్‌గా జమానుల్లా ఖాన్

ప్రజాశక్తి - నల్లచెరువు

నల్లచెరువు తహశీల్దార్‌గా టి.ఆర్ జమానుల్లా ఖాన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ తహశీల్దార్ గా విధులు నిర్వహిస్తున్న రవికుమార్ కదిరి ఆర్డీవో కార్యాలయానికి బదిలీపై వెళ్లారు. ఈసందర్భంగా జమానుల్లా మాట్లాడుతూ సాధారణ బదిలీలో భాగంగా రామగిరి మండలం నుండి తాను ఇక్కడికి వచ్చానని తెలిపారు. రెవిన్యూ సమస్యలు ఉన్న రైతులు తమ దృష్టికి తేవాలని సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని చెప్పారు. ఈసందర్భంగా బదిలీపై వెళ్తున్న తహశీల్దార్ రవికుమార్‌ను స్థానిక రెవెన్యూ సిబ్బంది సన్మానించారు.

బాధితుడికి ఆర్థికసాయం

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణంలోని త్యాగరాజనగర్‌లో నివాసముంటున్న హిదయతుల్లా, సల్మాల మూడేళ్ల కుమారుడు అదన్ క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్నాడు. వైద్య చికిత్సల కోసం అధిక మొత్తంలో డబ్బు అవసరం ఉండడంతో కుటుంబ సభ్యులు ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతుండగా ఈ విషయం తెలుసుకున్న ఏహెచ్ ఓ ఫౌండేషన్ సభ్యులు తోటి స్నేహితుల సహకారంతో రూ. 33,150 సేకరించి చిన్నారి తల్లిదండ్రులకు సోమవారం అందజేశారు. ఈ ఆర్థిక సహాయంతో వ్యాధి నయం కాదని, అలా ఎవరూ అనుకోకుండా తమకు తోచిన సహకారం అందజేయాలని ఫౌండేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏహెచ్‌వో ఫౌండేషన్ అధ్యక్షులు బాలు, సభ్యులు బాలాజీ, బాబా సుహెల్ ,దేవా, ప్రదీప్ , సిద్ధిక్ బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

నూతన జేపీసీ ఏర్పాటు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని ఎంఆర్‌సిలో జేపీసీ సమావేశాన్నిమండల ఉపాధ్యాయుల సమక్షంలో నిర్వహించారు. మండలంలోని అన్ని పాఠశాలల్లో మెగా పేరెంట్స్ మీటింగ్ విజయవంతంగా నిర్వహించాలనే అంశంపై చర్చించారు. అనంతరం నూతన జేపీసీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా అలీముల్లా, అధ్యక్షుడిగా వి.రవికుమార్, ప్రధాన కార్యదర్శిగా వి.సుందర్ రాజును ఎన్నుకున్నారు. అలాగే మహిళా అధ్యక్షురాలిగా పద్మావతి, ఉపాధ్యక్షురాలిగా జె.శశికళ బాధ్యతలు స్వీకరించారు.

ఆలయ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మండల పరిధిలోని జగరాజు పల్లి వద్ద గల ఓబులేసుని కొండ అభివృద్ధికి తనవంతు కృషి చేస్తాననిమాజీ మంత్రి పల్లె రఘు నాథ రెడ్డి అన్నారు. తొలి ఏకాదశి సందర్భంగా సోమవారం ఓబులేసుని ఆలయాన్ని మాజీమంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి సందర్శించారు. మాజీ మంత్రికి ఆలయ పూజారులు,ఆలయ కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివద్ధికి ప్రభుత్వం తరపున తగిన సహాయ సహకారాలు అందిస్తానని మాజీ మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు వాసు దేవారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, దయ్యాల ఉమాపతి, గూడూరు ఓబులేసు, శంకర్, చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికుల వినూత్న నిరసన

అర్ధనగ్నంగా నిరసన వ్యక్తం చేస్తున్న మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

తమ సమస్యను పరిష్కరించాలని కోరుతూ మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు వినూత్న నిరసన చేపట్టారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో అర్ధ నగ్న ప్రదర్శన నిర్వహించి నిరసన తెలిపారు. మున్సిపల్ యూనియన్ జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ ఆధర్యంలో నిర్వహించిన ఈ నిరసన కార్యక్రమానికి మున్సిపల్ మినిస్ట్రీయల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్. నరసింహులు పాల్గొని మద్దతు పలికారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ జీవో నెంబర్ 30 ప్రకారం కనీస వేతనం ఇవ్వాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింప చేయాలని హెల్త్ అలవెన్స్, రిస్క్ అలవెన్స్ అమలు చేయాలని, ఆప్కాస్ కార్మికులు అందరినీ పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలపై ఎన్నోసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. ఇంజనీరింగ్ కార్మికుల వేతనాల పెంపుపై ప్రభుత్వం ఇచ్చిన మాట తప్పితే ఈనెల 12 అర్ధరాత్రి నుంచి సమ్మెలోకి పోతామని హెచ్చరించారు. తక్కువ వేతనాలతో తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ఎన్నోసార్లు నిరసన తెలిపినప్పటికీ ప్రభుత్వాలు అధికారులు పట్టించుకోకపోవడం దుర్మార్గం అన్నారు. మున్సిపల్ మినిస్ట్రియల్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికులు చేస్తున్న ఆందోళనను తమ సంఘం సంపూర్ణ మద్దతు తెలుపుతోందన్నారు. కార్మికులు న్యాయపరంగానే వారి సమస్యలు పరిష్కరించాలని కోరడం న్యాయంగా ఉందన్నారు. ఇప్పటికైనా సమస్యలు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి పైపల్లి గంగాధర్, మున్సిపల్ ఇంజనీరింగ్ కార్మికులు యూనియన్ నాయకులు రమణ, రామదాసు, సద్దాం హుస్సేన్, నాగార్జున, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి : ఎంపీ, ఎమ్మెల్యే

అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాన్ని అందజేస్తున్న ఎంపీ

అభివృద్ధి కార్యక్రమాల కరపత్రాన్ని అందజేస్తున్నఎమ్మెల్యే

ప్రజాశక్తి - గాండ్లపెంట

కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని హిందూపురం ఎంపీ బికె పార్థసారథి, స్థానిక ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీ, ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈసందర్భంగా వారు ఇంటింటి వెళ్లి కరపత్రాలు అందజేశారు, అనంతరం వారు మాట్లాడుతూ కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటి అమలు పర్చుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బాబురావు, ఎంపీడీవో వెంకటరామిరెడ్డితో పాటు ఆయా శాఖల అధికారులు, టిడిపి మండల కన్వీనర్ కొండయ్య, ఎంపిపి సోమశేఖర్‌రెడ్డి, ఎంపిటిసిలు, సర్పంచులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు

పుట్టపర్తి అర్బన్ : ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను తప్పకుండా నెరవేరుస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూర పేర్కొన్నారు. సుపరిపాలనకు తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పెద్ద కమ్మవారిపల్లిలో ఎమ్మెల్యే ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం నెరవేర్చిన అంశాలపై కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. ఎమ్మెల్యే తో పాటు మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి ఇందులో పాల్గొన్నారు. గ్రామంలో తాగునీటి సమస్య ఎక్కువగా ఉందని గ్రామ ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వెంటనే స్పందించిన ఎమ్మెల్యే పల్లె సింధూర నూతన బోరు వేయడానికి మున్సిపల్ కమిషనర్ క్రాంతి కుమార్‌ను పిలిపించారు. అక్కడికి అక్కడే బోరు బండి పిలిపించి కొత్తగా బోరు వేయాలని ఎమ్మెల్యే కమిషనర్ ను ఆదేశించడంతో వెంటనే బోరు వాహనం పిలిపించి నూతన బోరు వేయించారు. దీంతో నీటి సమస్య తీరిందని గ్రామస్తులు ఎమ్మెల్యేకి మాజీ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు. బోరు వేయడానికి స్థల దాతలు అయిన ముమ్మనేని వెంకట్ రాముడు, వెంకటనారాయణ వారి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రత్నప్ప చౌదరి, మాజీ జడ్పిటిసి చెన్నకేశవులు, ముమ్మినేని వెంకటనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు గంగాధర్ నాయుడు, సురేష్ నాయుడు, గూడూరు ఓబులేసు, మురళి తదితరులు పాల్గొన్నారు.

'శ్రీరామిరెడ్డి' కార్మికులకు బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

శ్రీరామిరెడ్డి తాగునీటి పథకం కార్మికులకు బకాయి వేతనాలుచెల్లించాలని కార్మికులు కోరారు. ఈ మరకు సోమవారం పుట్టపర్తి కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో శ్రీరామ్ రెడ్డి తాగునీటి ప్రాజెక్టు కార్మికులు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టులో పని చేస్తున్న కార్మికులకు దాదాపు 15 నెలల నుంచి వేతనాలు ఇవ్వలేని దుర్భరపరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిఎంసి మెంబర్ ఎం.నరసింహమూర్తి, సిఐటియు కార్యదర్శి పై పల్లి గంగాధర్, గ్రామస్తులు నాగేంద్ర, అంజినప్ప, శ్రీరాములు, మురళిశంకర్, వెంకటేశప్ప తదితరులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

తన సమస్యను జేసీకి విన్నవిస్తున్న మహిళ

నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించాలి : జేసీ

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వచ్చిన అర్జీలను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డిఆర్‌ఒ విజయ సారథి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు సూర్యనారాయణ, రామసుబ్బయ్య, ఆర్డీవో సువర్ణ హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. అనంతరం జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ, ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో క్షుణ్ణంగా పరిశీలించి పారదర్శకంగా విచారణ చేసి నిర్ణీత గడువులోపు పరిష్కరించాలన్నారు. అర్జీలు పెండింగ్ లో లేకుండా అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలన్నారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఎక్కువగా భూ సమస్యలు, రేషన్ కార్డులు, ఇంటి పట్టాల మంజూరు, పింఛన్లు తదితర విజ్ఞప్తులపై 172 అర్జీలను అధికారులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు, అర్జీదారులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయండి

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఈనెల తొమ్మిదవ తేదీన నిర్వహించే దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు, నాయకులు కోరారు. సిఐటియు, రైతు సంఘం ఆధ్వర్యంలో పట్టణంలో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం తెచ్చిన నాలుగు లేబర్ కోడ్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్కీమ్ వర్కర్ల పైన రాజకీయ వేధింపులు ఎక్కువయ్యాయని వీటిని ఆపాలని డిమాండ్ చేశారు. నిత్యవసర ధరలు తగ్గించాలని సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అన్ని రంగాల కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు సాంబశివ, జగన్మోహన్, ముస్తాక్ అలీ, రామ్మోహన్, బాబ్జాన్, ఆంజనేయులు, సివిల్ సప్లై యూనియన్ నాయకులు శివప్రసాద్, ఫక్రుద్దీన్, మున్సిపల్ యూనియన్ నాయకులు తిరుపాలు, బాలకృష్ణ, నాగరాజు, రామకృష్ణ, రైతు సంఘం నాయకులు శివన్న, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హిందూపురం : కార్మికుల సమస్య పరిష్కారం కోసం ఈ నెల 9వ తేదీన తలపెట్టిన దేశ వ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్ పి శ్రీనివాసులు, సిఐటియు నాయకులు పిలుపునిచ్చారు. సమ్మె సన్నాహక కార్యక్రమంలో భాగంగా సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూముకుంట పారిశ్రామిక వాడలో పలు గార్మెంట్స్ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కరపత్రాలు పంపిణీ చేస్తూ సమ్మె చేపట్టడానికి గల కారణాలను వివరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కన్వీనర్ రాము, సిఐటియు నాయకులు లక్ష్మయ్య, బైలప్ప, హిందూపురం మున్సిపల్ యూనియన్ అధ్యక్షులు మల్లికార్జున, కోశాధికారి ఆనంద్, నారాయణ, రంగనాథ్, గంగ మూర్తి, చిన్న, వినోద్, గౌతమ్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పరిగి : ఈనెల 9న దేశవ్యాప్తంగా ట్రెండ్ యూనియన్లు కార్మిక సంఘాల ఆధ్వర్యంలో చేపడుతున్న దేశవ్యాప్త సమ్మెకు సహకరించాలని సిఐటియు నాయకులు పరిగి మండలంలోని గార్మెంట్స్ మహిళ కార్మికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. మండలంలోని కాలువపల్లి టెక్ఫోర్ట్ గార్మెంట్స్,పరిగి ఇండియన్ డిజైన్స్ వద్ద మహిళా కార్మికులను కలిసిన నాయకులు లేబర్ కోడ్ ల రద్దు, ఎనిమిది గంటల పనికల్పనపై దేశవ్యాప్త సమ్మె జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల నాయకులు శివప్ప, నందీశ్వర, మారుతి, నాగిరెడ్డి, రామకృష్ణ, శ్రీనివాస రెడ్డి, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

కదిరి టౌన్ : ఈనెల 9న కార్మిక సంఘాల తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెకు జి వి హెచ్ పి ఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా రాంప్రసాద్ నాయక్ మాట్లాడుతూ కార్మికులకు ఇప్పటివరకు ఉన్న ఎనిమిది గంటల పని దినాన్ని కేంద్రంలోనీ బిజెపి ప్రభుత్వం 10 గంటలు పనిచేయాలనుకుంటుందన్నారు. దీంతో కార్మికులు పని ఒత్తిడికి గురై అనారోగ్యం పాలవుతారని అన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని కాంటాక్ట్ అవుట్ సోర్సింగ్ కార్మికులను రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వసంస్థలైన సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని ఈనెల 9వ తేదీన జరగబోవు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను రైతులు ఉద్యోగులు ఉపాధ్యాయులు కార్మికులు ప్రజా సంఘాలు కలిసి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొని వచ్చే విధంగా సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

కదిరిలో బైక్‌ర్యాలీ

హిందూపురంలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న మహిళా కార్మికులు

పరిగిలో కరపత్రాల పంపిణీ

పాఠశాలలో స్మార్ట్ టీవీ అపహరణ

ప్రజాశక్తి - చిలమత్తూరు

గుర్తు తెలియని దుండగులు పాఠశాల తలుపులు పగలగొట్టి స్మార్ట్ టీవీ ని అపహరించిన ఘటన మండలంలోని దేమకేతేపల్లి గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో చోటు చేసుకుంది. హెచ్‌ఎం పద్మ తెలిపిన వివరాల మేరకు.. ఉదయం చెత్త ఊడ్చేందుకు వెళ్లిన మహిళ తలుపులు తాళం పగలగొట్టి తలుపులు తెరుచుకొని ఉన్న గదిని గమనించి హెచ్‌ఎం పద్మకు సమాచారం అందించింది. హెచ్‌ఎం పాఠశాలలో తనిఖీ చేసి స్మార్ట్ టీవీ చోరీకి గురైనట్లు గుర్తించారు. దీంతో చోరీ విషయాన్ని పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు హెచ్‌ఎం తెలిపారు.

హిమాని కోల్డ్ స్టోరేజ్‌లో విజిలెన్స్ తనిఖీలు

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం పట్టణంలోని వైసిపి మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి కి సంబంధించిన హిమాని కోల్డ్ స్టోరేజ్‌లో అనంతపురానికి చెందిన విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఎస్పీ ప్రసాద్, సిఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో హిమాని కోల్డ్ స్టోరేజ్ లో నిల్వ చేసిన చింతపండు బస్తాలను పరిశీలించారు. అదేవిధంగా కోల్డ్ స్టోరేజ్ కు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. కోల్డ్ స్టోరేజ్ నిల్వ సామర్థ్యం, లైసెన్స్, జిఎస్టీ రికార్డుతో పాటు ప్రతి సంవత్సరం లావాదేవీలు గురించి తెలుసుకున్నారు. సాధారణ తనిఖీల్లో భాగంగా హిందూపురంలో అన్ని కోల్డ్ స్టోరేజీలు తనిఖీ చేయడం జరుగుతోందని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా వైసీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్ రెడ్డి గత కొన్ని రోజులుగా పార్టీలో చురుగ్గా వ్యవహరించడంతోపాటు మంగళవారం నిర్వహించే వైయస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయనకు సంబంధించిన కోల్డ్ స్టోరేజ్ ను విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ అధికారులు తనిఖీ చేయడం రాజకీయ వర్గాల్లో చర్చనీయంగా మారింది.

భూ సమస్యను పరిష్కరించాలని విన్నపం

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

తనకు వారసత్వంగా ఉన్న భూమిని కొందరు 1 బి పాస్ పుస్తకాల్లో అక్రమంగా పేరు నమోదు చేసుకుని తనకు అన్యాయం చేస్తున్నారని వికలాంగుడు ఉత్తప్ప యాదవ్ అధికారులకు విన్నవించుకున్నాడు. ముదిగుబ్బ మండలం బి. కొట్టాల గ్రామానికి చెందిన చిన్న ఉత్తప్ప యాదవ్ ఈ మేరకు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌కు సోమవారం కలెక్టరేట్లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కారవేదికలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బ్రహ్మదేవరమర్రి రెవిన్యూ గ్రామ పొలంలో తనకు వారసత్వంగా వచ్చిన 16. 07 ఎకరాల భూమి ఉందన్నారు. ఈ భూమి తన అమ్మ నుంచి వారసత్వంగా వచ్చిందన్నారు. ఆ భూమికి వారసులైన తాను, తన సోదరుడు పెద్ద ఉత్తప్ప చాలా ఏళ్లుగా ఆ భూమిని సాగు చేసుకుంటున్నామన్నారు. అయితే ఈ భూమిని పుల్లన్న భార్య నాగమ్మ పేరుమీద 1 బి లో నమోదు చేసుకుని అక్రమంగా పాస్ బుక్కులు సృష్టించారన్నారు. వీరి పేర్లను 1 బి లో తొలగించి తమ అమ్మ నుంచి వచ్చిన సంక్రమిత ఆస్తిని తమకు కేటాయించాలని జాయింట్ కలెక్టర్‌ను కోరామన్నారు. తమ గ్రామానికి చెందిన ఆదినారాయణ యాదవ్, శంకర్నారాయణ, నారాయణస్వామి, సూర్యనారాయణ తదితరులు ఆ భూమిలోకి తమను రానివ్వకుండా దౌర్జన్యంగా ఆక్రమించి వారే ప్రస్తుతం ఖరీఫ్ సాగు కొరకు భూమిని దుక్కి దున్నారని ఆరోపించారు. వారి నుంచి తమకు ప్రాణహాని ఉందని తమకు రక్షణ కల్పించి భూమి తమకు ఇప్పించాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఇదే విషయమై జిల్లా ఎస్పీ కార్యాలయంలో కూడా ఫిర్యాదు చేసినట్లు చెప్పారు.

సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టం అమలుకు చర్యలు : ఆర్డీవో

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ధర్మవరం రెవెన్యూ డివిజన్లో సీనియర్ సిటిజన్ల సంక్షేమ చట్టాన్ని అమలు చేయడానికి తగిన చర్యలు తీసుకుంటున్నామని ఆర్డీవో మహేష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఈ చట్టం ప్రకారం తమ కార్యాలయానికి ఆరు ఫిర్యాదులు అందాయని వాటిని విచారణ చేస్తున్నామని, త్వరలో న్యాయం చేస్తామని చెప్పారు. ఇందులో భాగంగా పట్టణంలోని కొత్తపేటకు చెందిన 70 సంవత్సరాల గాజుల వెంకట లక్ష్మమ్మను ఆమె మనవడు గాజుల అనిల్ కుమార్ బాగోగులు చూసుకోకుండా ఆమె ఆస్తిని రాయించుకున్నాడన్నారు. ఫిబ్రవరి నెలలో గాజుల వెంకట లక్ష్మమ్మ ఫిర్యాదు ఇవ్వడంతో ఇరువురు మధ్య చట్టపరంగా విచారణ జరిపి మనవడికి మూడుసార్లు నోటీసులు కూడా ఇచ్చామన్నారు. దీంతో సీనియర్ సిటిజన్ నిర్వహణ సంక్షేమ చట్టం 2007 కింద తల్లిదండ్రుల, వద్దుల సంరక్షణ, రక్షణ పై బాధ్యత వహించాల్సి ఉండగా, నిర్లక్ష్యంగా నానమ్మ బాగోగులు చూసుకోకుండా ఎన్నో ఇబ్బందులు పెట్టడంతో, చివరకు నానమ్మ అయిన గాజుల వెంకట లక్ష్మమ్మ ఆస్తిని తిరిగి ఈమెకే చెందేటట్లు తీర్పుని ఇవ్వడం జరిగిందన్నారు. చట్ట ప్రకారం గాజుల వెంకట లక్ష్మమ్మ న్యాయవాది ద్వారా తన పోరాటాన్ని కొనసాగించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిఎఒ ఖతిజూన్ కుబ్రా, బాధితురాలు తరఫున న్యాయవాది తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులు

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16 నుంచి ఉచిత కంప్యూటర్ శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరికృష్ణ తెఇపారు. ఈ మేరకు సోమవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్ హబ్ ను ఏర్పాటు చేసినట్లు ఆ కళాశాల ప్రిన్సిపల్ జె.వి సురేష్ బాబు తెలిపారు. జులై 16నుండి 'మిస్ డేటా అనాలిస్ట్ – ఫైనాన్సియల్ సర్వీసెస్ కోర్సును ప్రారంభించడం జరుగుతుందని ఇందుకు 10, ఇంటర్ పాస్, డిగ్రీ, పోస్ట్ గ్రాడ్యుయేషన్ మరియు డిగ్రీ (బిఎ, బికాంక్ష్మి చేసిన ఆసక్తి కల్గిన యువతీ యువకులు తమ పేరు నమోదు చేసుకోవాలని కోరారు. మరిన్ని వివరాలను 9182288465 నంబర్‌కు ఫోన్ చేసి వివరాలను కనుక్కోవాలన్నారు, లేదా ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నేరుగా సంప్రదించవచ్చునని కోరారు. శిక్షణ అనంతరం వీరికి ఉద్యోగ అవకాశం కల్పించడం జరుగుతుందని తెలియచేసారు. నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యువతకు కువైట్‌లో ఉద్యోగావకాశాలు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

నిర్మాణ రంగంలో అనుభవం ఉన్న యువతకు నిర్మాణ రంగ ఉద్యోగ అవకాశాలు కువైట్ లో కల్పించడం జరుగుతుందని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి బండ్ల హరికృష్ణ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ధట్ రుయా వారి భాగస్వామ్యంతో కువైట్ లోని నిర్మాణ రంగంలో నైపుణ్య ఉద్యోగాల కోసం అవకాశాలు కల్పిస్తోందన్నారు. రాష్ట్రానికి చెందిన అనుభవజ్ఞులైన నిర్మాణ కార్మికులకు విదేశీ ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగా సిరామిక్ ఫ్లోరింగ్, పెయింటింగ్, ఎలక్ట్రికల్, లేదా సీలింగ్ వర్క్ లో ఐటిఐ, డిప్లమా కలిగి ఉండి 3 నుంచి 5 సంవత్సరాలు అనుభవం ఉన్న 25 నుంచి 50 మధ్య వయసు కలిగిన పురుష అభ్యర్థుల నుంచి ఉద్యోగాల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామన్నారు. ఈ ఉద్యోగాలు రెండు సంవత్సరాల కాంట్రాక్టు మీద పనిచేయాల్సి ఉంటుంది అన్నారు. కువైట్ దినార్లు సుమారుగా నెలకు రూ. 56 వేల నుంచి 70 వేల రూపాయల వరకు వేతనం ఉంటుందన్నారు. వీసా ప్రాసెసింగ్, విమాన టికెట్లు, వైద్య సదుపాయాలు, వసతి వంటి ఏర్పాట్లను కంపెనీ వారు చెల్లిస్తారన్నారు. అభ్యర్థులు చెల్లుబాటు అయ్యే పాస్‌పోర్ట్, ఐటిఐ, డిప్లమా సర్టిఫికెట్స్, అనుభవం ధ్రువీకరణ పత్రాలు సమర్పించాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు నైపుణ్య అభివృద్ధి సంస్థ వెబ్ సైట్ లో నమోదు చేసుకోవచ్చున్నారు.

చెట్ల నరికివేతపై కేసు నమోదు

ప్రజాశక్తి వార్తకు స్పందన

ప్రజాశక్తి -చిలమత్తూరు

మండలంలోని వీరాపురంలో వలస పక్షుల గూళ్లున్న నిషేధిత ప్రాంతంలో చెట్ల నరకివేతపై అటవీశాఖ అధికారులు స్పందించారు. 'వలస పక్షుల గూడును చిదిమేస్తున్నారు' అనే శీర్షికతో ప్రజాశక్తి దినపత్రికలో సోమవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. అక్రమంగా వేప, టేకు చెట్లను నరికినట్లు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో రెండు డీజిల్ మిషన్లను స్వాధీనం చేసుకున్నట్లు ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ కేశప్ప తెలిపారు. చెట్ల నరికివేత వేసిన వ్యక్తులపై అధికారులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సైబీరియన్ వలస పక్షులగూళ్లు ఉండే ప్రాంతాన్ని రక్షించేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.